బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్, జనవరి 19 : తలకొండపల్లి మండల కేంద్రానికి ఇప్రాయిపల్లి నర్సమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఉదయం నర్సమ్మ మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ సమకూర్చిన రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని నాయకులు మనోధైర్యాన్నిచ్చారు. అలాగే కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన వరికుప్పల బాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.3 వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ జ్యోతయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్‌యాదవ్, నాయకులు యాదయ్య, విఠల్, మహేశ్, రవి, శ్రీను, శివ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

చింతపట్లలో మాస్ ఫండ్ సేకరిస్తున్న పగడాల యాదయ్య

యాచారం, జనవరి 19 : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. మండల పరిధిలోని చింతపట్లలో ఆయన సీపీఎం నాయకులతో కలిసి ఆదివారం మాస్ ఫండ్ క్యాంపెన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో ప్రజాపాలన గతి తప్పందన్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి అక్రమ కేసులు, అరెస్టులపై దృష్టి సారిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలు లేవనెత్తనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జంగయ్య, వెంకటయ్య, పద్మ, సత్యం, గిరికాంత్, రమేశ్, ప్రభాకర్, శేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

- ఓపెన్ స్కూల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ మాధవి
- పది, ఇంటర్మీడియట్ తరగతుల పరిశీలన

విద్యార్థులతో మాట్లాడుతున్న ఓపెన్ స్కూల్ రాష్ట్ర కో -ఆర్డినేటర్ మాధవి

షాద్‌నగర్‌టౌన్, జనవరి 19 : ఓపెన్ స్కూల్ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఓపెన్ స్కూల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ మాధవి అన్నారు. షాద్‌నగర్‌లో పట్టణంలోని ఎయిడెడ్ జియోన్ పాఠశాలలో కొనసాగుతున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియట్ తరగతులను ఆదివారం ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఓపెన్ స్కూల్‌లో బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా వినాలని, పట్టుదలతో చదువుకుంటే పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలను సులభంగా రాసేందుకు వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, పాఠశాల కో-ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్, విక్రమ్, శిరీష, రవీందర్, చెన్నయ్య, మహేందర్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

గొల్లపల్లిలో క్రికెట్ టోర్నమెంట్

విజేత టీం సభ్యులకు నగదు, షీల్డ్‌లు అందజేస్తున్న మాజీ ప్రజా ప్రతినిధులు

చేవెళ్ల రూరల్, జనవరి 19 : చేవెళ్ల మండల పరిధిలోని గొల్లపల్లిలో స్థానిక మాజీ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజేత టీం సభ్యులకు షీల్డ్‌లు, నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి విజేత కొత్తపల్లి క్రికెట్ టీమ్‌కు రూ.12 వేలు, రెండో విజేత కుతుబుద్దీన్ టీమ్‌కు రూ.6 వేల నగదును స్థానిక నేత లక్ష్మణ్ గౌడ్, మాజీ సర్పంచ్‌శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో దేహదారుఢ్యం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కందికొండ సత్యంగౌడ్, క్రీడాకారులు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



నందిగామలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, జనవరి 19 : క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ కోమ్ము కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మైనింగ్ కంపెనీలో డిటోనేటర్లు స్వాధీనం

కడ్తాల్, జనవరి 19 : అనుమతులు లేకుండా మైనింగ్‌లో డిటోనేటర్లు ఉంచిన మైనింగ్ నిర్వాహకులపై కేసు నమోదైన ఘటన శనివారం రాత్రి కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామ శివారులో సర్వే నంబర్ 82లో ఐదు ఎకరాల భూమిలో మైనింగ్ నిర్వహిస్తున్నారు. మైనింగ్ కంపెనీలో డిటోనేటర్లు ఉన్నాయనే సమాచారంతో శనివారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. షెడ్డులోని ఒక బ్యాగులో 13 కట్టల పేలుడు పదార్థాలు (డిటోనేటర్లు) ఉన్నట్లు గుర్తించినట్లు సీఐ తెలిపారు. మైనింగ్ కంపెనీ సూపర్‌వైజర్ నీలి శంకర్‌ను పోలీసులు విచారించగా, రాజేందర్ అనే వ్యక్తి 2023లో మైనింగ్‌లో బ్లాస్టింగ్ చేసేందుకు యజమానితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం రాజేందర్‌కు చెందిన వ్యక్తులు వచ్చి పేలుడు పదార్థాలను కంపెనీలోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు నిల్వ చేయడానికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఎస్సై వరప్రసాద్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. ఈ మేరకు శంకర్‌తోపాటు బ్లాస్టింగ్ లీజుదారుడు రాజేందర్, మైనింగ్ కంపెనీ యజమాని అశ్విని, కేర్ టేకర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. శంకర్‌ను అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించామని, మిగతా ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ వివరించారు.

బీఆర్ఎస్ యువజన విభాగం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

నందిగామ, జనవరి 19 : ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నందిగామ మండల అధ్యక్షుడు కడాల శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యువజన విభాగం నాయకులు ముందుండాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, షాద్‌నగర్ మున్సిపాల్ వైస్ చైర్మన్ నట రాజన్, నాయకులు లక్ష్మణ్ నాయక్, గోవర్ధన్, మోహన్‌నాయక్, మురళీధర్‌రెడ్డి, లింగం, శ్రీహరి, పరశురాం, ప్రసాద్, శ్రీశైలం, విజయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులతో సీఐ శివప్రసాద్, ఎస్సై వరప్రసాద్

కడ్తాల్, జనవరి 19 : రక్తదానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడాలని సీఐ శివప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముద్విన్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2012-13 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేసేందుకు యువత ముందుండాలన్నారు. శిబిరంలో 40 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వరప్రసాద్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గిరిజనుల రిలే దీక్షలు

దీక్షలో పాల్గొన్న భూ బాధితులు

చేవెళ్ల రూరల్, జనవరి 19 : శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్, వెలిమెల శివారులోని లంబాడా గిరిజనులకు సంబంధించిన 80 ఎకరాల బిలాదాకాల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న గిరిజనులు మాట్లాడుతూ.. పలు రియల్ ఎస్టేట్ కంపెనీలు తమకు సంబంధించిన 80 ఎకరాల బిలాదాకాల సర్వే నంబర్ 633 నుంచి 644 వరకు భూములను అన్యాయంగా గుంజుకున్నారని, స్థానిక తహసీల్దార్, అధికారులు వారికే వంత పాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. మా భూములు తమకు దక్కేవరకు ఊరుకునేది లేదని, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో పి.లక్ష్మణ్, రవి, శంకర్, బాబు, లక్ష్మణ్, చందర్, రెడ్డి, గోపి, సోనీబాయి, తులసి, గోమా, మున్నా, శంకరమ్మ, మణెమ్మ, పి.కవిత, కొండకల్ మాజీ వార్డు సభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మర్రివాగు రాజు, తండా వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసే వరకు పోరాటం ఆగదు

ఎమ్మార్పీఎస్ నూతన మండలాధ్యక్షుడు అబ్బు రమేశ్‌కు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, జనవరి 19 : ఎస్సీ వర్గీకరణ చేసే వరకు పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కిరణ్ పూలే మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా నర్సింహతోపాటు ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగాళ్ల బాబు మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నూతన మండల అధ్యక్షుడిగా అబ్బు రమేశ్, ఉపాధ్యక్షులుగా జి.నరేశ్, కే.మహేందర్, కార్యదర్శిగా ఏ.యాదయ్యను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న, 'లక్ష డప్పులు-వేయి గొంతులు' ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల నుంచి కళాకారులు డప్పులతో ప్రదర్శనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మంగళ్‌పల్లి నర్సింహ, గురిగళ్ల లక్ష్మయ్య, పోతుగంటి శంకర్, మంకి శ్రీను, కంబాలపల్లి అంజి, మంకి మహేశ్, ఒగ్గు మహేశ్, యాదయ్య, శ్రీకాంత్, నిఖిల్, వీరేశ్, శేఖర్, కుమార్, రాజశేఖర్, జంగయ్య, ఎంఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

టోర్నమెంట్‌లో విజేత జట్లకు బహుమతులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

మొయినాబాద్, జనవరి 19 : గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన గుమ్మళ్ల సీతారాంరెడ్డి జీఎస్ఆర్-ఎస్‌పీఎల్ సీజన్-3 క్రికెట్ టోర్నమెంటు నిర్వహించారు. ఇందులో ఆరు జట్లు పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్ పోటీల్లో హైదరాబాద్ జట్టు విజేతగా, గుజరాత్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ కౌన్సిల్ సభ్యుడు సన్‌వల్లి ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఎం శ్రీకాంత్ ప్రథమ స్థానంలో నిలిచిన హైదరాబాద్ జట్టు కెప్టెన్ నిర్డుల మహేశ్‌రెడ్డికి రూ.20 వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన గుజరాత్ జట్టు కెప్టెన్ బొర్ర సందీప్‌కు రూ.10 వేట నగదుతో పాటు షీల్డ్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించిన యువకులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నేడే ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు, జనవరి 19 : ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానా ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌వో పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి శుక్లాలు, కంటి చూపు మందగించినా.. కంటి సమస్యలు ఉన్న వారందరూ ఆధార్‌కార్డు, రేషన్ కార్డు తీసుకుని వైద్య శిబిరానికి హాజరు కావాలని వారు సూచించారు.

రేపటి నుంచి గ్రామ సభలు

ఆమనగల్లు, జనవరి 19 : మండల పరిధిలో ఈ నెల 21 నుంచి 23 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుసుమ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ కమిటీలు, గ్రామస్తులు, సంబంధిత అధికారుల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 21న ఆకుతోటపల్లి, చెన్నంపల్లి, చింతలపల్లి, కోనాపూర్, కొత్తకుంటతండాల్లో.. 22న మేడిగడ్డ, మంగళపల్లి, పోలేపల్లి, రాంనుంతల, సీతారాంనగర్‌తండా, శెట్టిపల్లి, శంకర్ కొండతండా, సింగంపల్లి గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజలు అందుబాటులో ఉండి సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

మైనర్లను పనిలో పెట్టుకుంటే కేసులు తప్పవు

కడ్తాల్, జనవరి 19 : మైనర్లను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ శివప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రం సమీపంలో సుధీర్‌రెడ్డికి చెందిన పౌల్ట్రీ ఫాంలో, మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాలుడు (16) కొన్ని నెలలుగా లేబర్‌గా పని చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం రాత్రి కడ్తాల్ పోలీసులు, షాద్‌నగర్ షీ టీం సంయుక్త ఆధ్వర్యంలో పౌల్ట్రీ ఫాంపై దాడులు చేసినట్లు సీఐ తెలిపారు. ఫౌల్ట్రీ ఫాంలో తనిఖీలు చేయగా పనులు చేస్తున్న మైనర్ బాలుడిని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఫౌల్ట్రీ ఫాం యజమాని సుధీర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దుకాణ, వ్యాపార సముదాయాల్లో చిన్న పిల్లలను పని పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

షాబాద్, జనవరి 19: ఎక్కడో పుట్టి...ఎక్కడో పెరిగి...ఇక్కడే కలిశాం... చదువులమ్మా చెట్టు నీడనా అంటూ ఓ సినీ కవి రాసిన పాటను పూర్వపు విద్యార్థులు నిజం చేశారు. సుమారు 23ఏండ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులందరూ ఒకచోట కలుసుకున్నారు. చేవెళ్ల మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002 సంవత్సరంలో 9వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులైన వెంకటేశ్వర్లు, గోవర్ధన్, వసంతయ్య, కిష్టయ్య, జ్యోతి తదితరులను సమావేశానికి పిలిపించి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దుద్యాల అన్నపూర్ణ, సువర్ణ, సరిత, మంజుల, శోభ, సంపత్‌కుమార్, మల్లేశ్, రాంచందర్, సురేందర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్లలో..

మంచాల : చిన్ననాటి జ్ఞాపకాలు, చిలిపి ముచ్చట్లు, ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఆనందంగా గడిపారు. మంచాల మండల పరిధిలోని ఆరుట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 1991-92బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు కాగజ్‌ఘట్‌లో ఉన్న సిరి నేచర్ రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గత అనుభవాలు, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యా బుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చీరాల రమేశ్, జగన్‌మోహన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్, ప్రకాశ్ గౌడ్, రవి గౌడ్, పద్మ, కవిత, అలివేలు, సరిత, రజిత, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

దోబీపేట్‌లో..

చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లి మండల పరిధిలోని దోబీపేట్ గ్రామంలో ఉన్న జడ్పీహెచ్ఎస్‌లో 2005-06 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండల పరిధిలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 19 ఏండ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి వారికి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా పాత మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ :ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న దేవుని ఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

మంచాల : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చేవెళ్ల రూరల్ : సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

దేవునిఎర్రవల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడు సామ మాణిక్యారెడ్డి తదితరులు

చేవెళ్ల రూరల్, జనవరి 19 : చేవెళ్ల మండల పరిధిలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో ఎంపీ ల్యాడ్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం మాజీ సర్పంచ్, హైదరాబాద్ బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడు సామ మాణిక్యారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ ప్రభాకర్, గ్రామస్తులు ఎదిరె శ్రీశైలం, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

శంషాబాద్ రూరల్, జనవరి 19 : మండల పరిధిలోని సుల్తాన్‌పల్లి గ్రామానికి చెందిన ఎల్గని కృష్ణాగౌడ్ ఆనారోగ్యానికి గురికావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ మేరకు బాధితుడికి సీఎం సహాయ నిధి నుంచి రూ.60వేలు మంజూరైంది. ఈ చెక్కును గ్రామ మాజీ సర్పంచ్ దండు ఇస్తారి ఆదివారం బాధిత కుటుంబ సభ్యుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవర్గాల కోసం ప్రవేశపెట్టిన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వారికి వైద్యసేవలం దిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగారెడ్డి, శివగౌడ్, మైలారం ఆశోక్,సుధాకర్, తేజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయండి

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 19: బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనకడన సాగుతుండడంతో ఈ దారి గూండా ప్రయాణించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు జాజాల రుద్రకుమార్ కోరారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఉడ్డెంగడ్డ రైల్వే స్టేషన్ నూతన బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్న నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలని కోరుతూ సీపీఎం నాయకుడు వెంకటయ్య అధ్యక్షతన బ్రిడ్జి ముందు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రుద్రకుమార్ మాట్లాడుతూ.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఉడ్డెంగడ్డ రైల్వే స్టేషన్ దగ్గర ఫ్లై ఓవర్ పనులు దాదాపు నాలుగేండ్ల నుంచి జరుగుతున్నాయన్నారు. ఇండ్ల చుట్టు పక్కల కూలగొట్టి రోడ్డును వెడల్పు చేశారన్నారు. ఈ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతుండడంతో ఈ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దారిని మూసి వేయడంతో ప్రజలు మెయిన్ రోడ్డుకు రావాలంటే మొత్తం రౌండ్ తిరిగి వచ్చేసరికి నాలుగు నుంచి ఐదు కిలోమీటర్లు అవుతుందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేసేలా చొరవ చూపాలని కోరారు. పనుల్లో వేగం పెంచకపోతే బస్తీ వాసులతో కలిసి పెద్ద ఎత్తున న్యాయపోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు ఎన్.జొంగయ్య, బచ్చలకూర స్వామి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, భీమయ్య, చాంద్ పాషా, ఇమ్రాన్, జహంగీర్, జి.ఎం.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఉడ్డెంగడ్డ రైల్వే స్టేషన్ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఫ్లై ఓవర్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు